నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 8 జూలై 2024 | HYDERABAD

ఎల్లమ్మకు తొలి బోనం

వైభవంగా గోల్కొండ బోనాలు.. కోటకు పోటెత్తిన భక్తులు.. జగదాంబికకు మొక్కులు

లంగర్‌హౌస్‌లో బోనాలను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

501 బోనాలను సమర్పించిన కుమ్మరులు

ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి

మెహిదీపట్నం, జూలై 7: నగరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆదివారం గోల్కొండ కోటలో కొలువైన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మకు తొలి బోనం సమర్పించారు. దీంతో భాగ్యనగరంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత లంగర్‌హౌస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు చెన్నారెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ మాజీ సభ్యుడు హన్మంతరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి, పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్‌కుమార్‌తో కలిసి బోనాలను ప్రారంభించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం తొట్టెలకు కల్లు సాక పోసి.. స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే దానం నాగేందర్ పోతరాజులతో కలిసి నృత్యాలు చేశారు. అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. గోల్కొండ బంజారా దర్వాజ నుంచి కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, నాయకులు రాజువస్తాద్, నాగాబాయి, శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో నజర్ బోనంను ఎల్లమ్మకు సమర్పించారు. అలాగే, తెలంగాణ కుమ్మరుల సంఘం ఆధ్వర్యంలో 501 బోనాలను సమర్పించారు. కుమ్మరుల సంబురాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. పోతరాజుల నృత్యాలు, కళాకారుల ఆటపాటలతో లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి తొట్టెల ఊరేగింపు సాగింది. కాగా, గవర్నర్ రాధాకృష్ణన్ గోల్కొండ కోటలో బోనాల పూజలు నిర్వహించారు.

బోనాలను ఘనంగా జరుపుకోవాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

ఆషాఢ మాసం బోనాలను ప్రజలు ఉత్సాహంతో జరుపుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ఆకాంక్షించారు. గోల్కొండ బోనాలను లంగర్‌హౌస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రారంభించిన అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆషాఢ బోనాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించాలని నిర్ణయించారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ గోల్కొండ బోనాలను ఉత్సాహంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆషాఢ మాసం బోనాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి కొండా సురేఖ చెప్పారు.

ఎల్లమ్మ కల్యాణం.. ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో: బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో సోమ, మంగళ, బుధవారాల్లో ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం, రథోత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో మూడు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

ఘటోత్సవ అలంకరణ

బేగంపేట, జూలై 7: ప్రతిష్టాత్మక సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం వద్ద ఆషాఢ బోనాల జాతర సందడి ప్రారంభమైంది. ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఘటోత్సవాల్లో భాగంగా ఆదివారం మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అమ్మవారి ఘటత్సోవ అలంకరణను ప్రారంభించారు.

గాడ్ ఫాదర్ ఉండాల్సిందేనా..!

లేకుంటే కిందిస్థాయి సిబ్బంది కూడా మాట వినరు

పోలీస్ శాఖలో చర్చనీయాంశమైన ఎస్ఐ ఆత్మహత్య ఘటన

సిటీబ్యూరో: వృత్తిలో రాణించాలంటే గాడ్ ఫాదర్ సపోర్టు ఉండాల్సిందే. లేకుంటే కిందిస్థాయి సిబ్బంది కూడా మాట వినరు. సీనియర్లు అసలు పట్టించుకోరు. ఇలాంటి పరిస్థితులతో మానసిక వేధింపులకు గురవుతున్న కొందరు అధికారులు..బలవన్మరణం దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాములు ఆత్మహత్య ఘటనే నిదర్శనమని పోలీస్ శాఖలో కొందరు పేర్కొంటున్నారు. ఎస్ఐ శ్రీరాములు తన ఆత్మహత్యకు గల కారణాన్ని వివరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చర్చనీయాంశమైంది. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే ఆదుకునేందుకు ఒక గాడ్ ఫాదర్ కావాలి. గాడ్ ఫాదర్ ఉంటే అనుకున్న స్థానంలో పోస్టింగ్ వస్తుంది. పనిచేయకపోయినా గాఢ్ ఫాదర్ ఉంటే ఇంటికే జీతం వస్తుంది. ఇలా ప్రతి డిపార్టుమెంట్‌లో చాలా మందికి గాఢ్ ఫాదర్లు ఉంటారు. అయితే నిజాయతీగా పనిచేసే వారికి మాత్రం గాడ్ ఫాదర్లు ఉండరు. అలాంటి వారికి ఏదో చోట..అప్రాధాన్యమైన పోస్టింగ్‌లు ఇస్తుంటారు. ఇవన్నీ పోలీస్ శాఖలో ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఇది కేవలం పోలీస్ శాఖకే పరిమితం కాలేదని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లోనూ ఇదే ద్వంద్వ నీతి ఉంటోందని పలువురు పేర్కొంటున్నారు. గాడ్ ఫాదర్ లేనంత మాత్రానా.. తమ పై అధికారి పట్టించుకోనంత మాత్రానా ప్రాణాలు తీసుకోవద్దని, సమస్య ఉంటే..బయటకు చెప్పి ఇతరులను ఒప్పించే ప్రయత్నం చేసి గెలువాలని, ఆత్మహత్యల జోలికి వెళ్లొద్దని పలువురు సూచిస్తున్నారు.

ది కేవ్ పబ్‌లో 'మత్తు' పార్టీ

గంజాయి తీసుకున్న 24 మందితో పాటు మేనేజర్ అరెస్టు

శేరిలింగంపల్లి: వీకెండ్ థీమ్ పార్టీల పేరుతో డ్రగ్స్ పార్టీలను నిర్వహిస్తున్న ది కేవ్‌పబ్‌పై పోలీసులు దాడి చేసి.. గంజాయి తీసుకున్న 24 మందితో పాటు మేనేజర్‌ను అరెస్టు చేశారు. డీసీపీ వినీత్ వివరాలు వెల్లడించారు. ఖాజగూడలోని ఎస్‌వీ ఆర్కేడ్ భవనంలోని 'ది కేవ్ పబ్'లో డ్రగ్స్ పార్టీలు జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి ఎస్‌వోటీ, నార్కోటిక్, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఆ సమయంలో ఉన్న 55 మంది నుంచి నమూనాలు సేకరించగా, 24 మంది గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. పార్టీకి వచ్చేముందు వీరందరూ గంజాయి సేవించి ఈ పార్టీలో పాలుపంచుకున్నట్లు గుర్తించారు.

అబిడ్స్‌లోని ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. అంతకుముందు ఎన్‌టీఆర్ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ రథయాత్ర ప్రారంభమైంది. ఎగ్జిబిషన్ మైదానం చేరుకున్న అనంతరం జగన్నాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. 12 వేల మంది భక్తులతో మహా హారతి.. రెండు వేల రకాల పిండి వంటలతో మహా నైవేద్యం సమర్పించారు. ఇస్కాన్ మేడ్చల్ శాఖ అధ్యక్షుడు గోవిందదాస్ ఆధ్వర్యంలో జగన్నాథుడి రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి గవర్నర్ రాధాకృష్ణన్, ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. – సుల్తాన్‌బజార్/చిక్కడపల్లి/మేడ్చల్

గ్రేటర్‌లో టాయిలెట్స్ కనిపిస్తలే..!

గతంలో 7,400 టాయిలెట్ల ఏర్పాటు

ప్రస్తుతం రికార్డులో 1,857 మాత్రమే

సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో వందకు వంద శాతం బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా సాధించాలనే లక్ష్యానికి అధికారులు నీళ్లొదిలారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత (ఓడీఎస్ ప్లస్ ప్లస్) నగరంగా హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు ప్రశ్నార్థకంగా మారింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్, వాటర్ ప్లస్, స్వచ్ఛ హైదరాబాద్ వంటి ర్యాంకులతో నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. కానీ గడిచిన ఏడు నెలలుగా టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కనిపించని పబ్లిక్ టాయిలెట్లకు బిల్లులు, వినియోగించని మరుగుదొడ్లకు నిర్వహణ వ్యయం చెల్లించడం జీహెచ్ఎంసీకే చెల్లింది. ప్రతి అరకిలోమీటరు రద్దీ రోడ్లలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. ప్రస్తుతం ఆరు జోన్లలో 4,826 సీట్లలో 1,857 పబ్లిక్ టాయిలెట్లను మాత్రమే నిర్మించినట్లు లెక్కలు చెబుతున్నాయి. గతంలో 7,400 టాయిలెట్ల నిర్మించగా, సగానికి పైగా వినియోగంలో లేవు..కొన్ని చోట్ల కనిపించడం లేదు. బిల్లుల చెల్లింపులు మాత్రం యథావిధిగా జరుపుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

నాడు కోటి మొక్కలు..నేడు 30 లక్షలే

గ్రేటర్‌లో పచ్చదనం పెంపుపై కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరిఢవిల్లిన పచ్చదనం

నేడు వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు

సిటీబ్యూరో, జూలై 7 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కారు గ్రేటర్‌లో కంటితుడుపు చర్యగా పచ్చదనం పెంపునకు సిద్ధమైంది. వన మహోత్సవం పేరిట ఈ ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలో కేవలం 30.81 లక్షల మొక్కలతోనే సరిపెట్టాలని నిర్ణయించింది. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసింది. ఈ మేరకు నేడు అన్ని సర్కిళ్లలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం జరిగే వన మహోత్సవాన్ని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఒక్కరోజే 7,135 మొక్కలను ప్రజాప్రతినిధులతో నాటనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం గంటలకు ఉప్పల్ సర్కిల్ 2, హబ్సిగూడ సర్కిల్ 8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రామాంతాపూర్‌లో జరిగే కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి పాల్గొంటారు. పార్కులు, మీడియం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మొక్కలు ఇస్తారు. అలాగే ఇంటింటికీ మొక్కలను సరఫరా చేయనున్నట్లు అధికారులు చెప్పారు.

ఏటా కోటి మొక్కలు నాటిన బీఆర్ఎస్ సర్కారు

కేసీఆర్ ప్రభుత్వంలో వరుసగా 8 సార్లు హరితహారం కింద ప్రతి ఏటా గ్రేటర్‌లో కోటి మొక్కలను నాటింది. ఖాళీ స్థలాల్లో యాదాద్రి మోడల్ మియవాకి, వర్టికల్, థీమ్ పార్కులు, మెరిడియన్, అవెన్యూ ప్లాంటేషన్, జంక్షన్ సుందరీకరణ ట్రీ పార్కులు ఇలా రకరకాల పేర్లతో పచ్చదనం, సుందరీకరణ పనులను చేపట్టింది. కాలనీలను పచ్చదనంతో నింపేసింది. ఫలితంగా హైదరాబాద్ మహా నగర పరిధిలో 147 శాతం అటవీ విస్తీర్ణం పెరిగింది.తెలంగాణకు హరితహారం చేపట్టిన తర్వాత అటవీ విస్తీర్ణం 81.81 స్క్వేర్ కిలోమీటర్లకు పెరిగినట్లు ఎఫ్ఎస్ఐ ప్రకటించింది. ఎఫ్ఎస్ఐతో పాటు అర్బోర్ డే ఫౌండేషన్ సంస్థ, ఎఫ్ఏవో సంస్థలు 2020 సంవత్సరానికి హైదరాబాద్ నగరాన్ని ట్రీ సిటీ ఆఫ్ వరల్డ్‌గా గుర్తించింది. పచ్చదనం పెంపునకు గత సర్కారు పెద్దపీట వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూడటం పట్ల పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు.